రైతన్నా.. జర భద్రం..!

- రసాయనాల పిచికారీ సమయంలో అప్రమత్తత తప్పనిసరి
- అజాగ్రత్తతో ఆసుపత్రుల పాలవుతున్న రైతులు
- అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి


పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

వాంకిడి: రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువ సమయం పంట పొలాల్లోనే గడుపుతుంటారు. దుక్కిదున్ని విత్తనాలు నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకు అన్నదాత కష్టాలు అన్నీఇన్నీ కావు. పంటను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు క్రిమిసంహారక రసాయనాలు పిచికారీ చేస్తుంటారు. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొందరు రైతులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఏపుగా పెరిగిన పత్తి మొక్కలకు మందులు కొట్టే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అస్వస్థతకు గురై గతంలో మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. వ్యవసాయ, వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే రైతులకు ప్రాణహాని ఉండదని నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

మండలంలో పత్తి పంటే ప్రధాన పంట. కాగా మండల వ్యాప్తంగా సుమారు 32 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత, కాయ దశలో ఉన్న పంటకు చీడ పురుగులు పట్టకుండా రైతులు ముమ్మరంగా శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా పూత రాలకుండా, కాయ ఆరోగ్యవంతంగా పెరిగేందుకు రైతులు క్రిమి సంహారక, రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. కానీ తగు జాగ్రత్తలు మాత్రం పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రస్తుతం పత్తి మొక్కలు ఏపుగా పెరిగి మనిషి ఎత్తులో ఉన్నాయి. కావున రైతులు పురుగుల మందు పిచికారీ చేసే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. గతంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పలువురు రైతులు మందుల పిచికారీ చేసిన అనంతరం అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని రైతులు తగిన జాగ్రత్తలతో పనులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే రెండు రోజులకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతుండడంతో మందు పిచికారీ చేసే క్రమంలో రైతు ముక్కు, నోటిలో విషవాయువు గాలి రూపంలో వెళ్లే అవకాశం ఉంటుంది. కావున రైతులు తప్పనిసరిగా మాస్కు, హెల్మెట్ లేదా ఒక గడ్డ ముఖానికి చుట్టుకోవాలి.
- చేతికి గ్లౌజులు తొడగటం, చర్మం కనబడకుండా బట్టలు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలి.
- మందు పిచికారీ చేసే క్రమంలో రైతులు తంబాకు, పాన్ మసాల, జర్దా లాంటివి తీసుకోకూడదు.
- మందు నీళ్లలో కలిపే సమయంలో గ్లౌజులు తొడిగి కర్రతో కలపాలి. ఆ సమయంలో ఎలాంటి పదార్థాలు నోట్లో వేసుకోవద్దు.
- భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలి.
- మోతాదుకు మించి రసాయనాలు కలుపుకోవద్దు.
- గాలికి ఎదురుగా పిచికారీ చేయడం వల్ల శరీరం మొత్తం రసాయనాలతో తడిచే ప్రమాదం ఉంటుంది కావున అలా స్ప్రే చేయకూడదు.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులతో సమావేశాలు నిర్వహించిన ప్రతీసారి మందు పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. క్రిమిసంహారక మందు డబ్బాలపై ఎరుపు, పసుపు, నీలం, ఆకుపచ్చ గుర్తులు మందుల ప్రభావాన్ని సూచిస్తాయి. వాటిని వాడేటప్పుడు తప్పకుండా వైద్యులు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి.

- గోపికాంత్, మండల వ్యవసాయాధికారి

జాగ్రత్తలు పాటించాలి



రైతులు తమ పంట పొలాల్లో క్రిమి సంహారక రసాయనాలు పిచికారీ చేసే క్రమంలో శరీరం పూర్తిగా బట్టతో కప్పి ఉండేలా తగు జాగ్రత్తలు పాటించాలి. అధికారుల సూచనల మేరకు మెలగడం తప్పనిసరి. పిచికారి చేసే క్రమంలో అజాగ్రత్తగా ఉండి అస్వస్థతకు గురైన కేసులు ఇప్పటికే నమోదవుతున్నాయి. తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి.

- వినయ్ ఉప్రే, మండల వైద్యాధికారి

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్అర్బన్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలానికి చెందిన జులేఖ మహ్మద్ కుటుంబానికి రూ.2 లక్షలు ఎల్‌వోసీ అందజేసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి అండగా నిలిచారు. శనివారం ఎల్‌వోసీని బాధితురాలి మనుమడు నౌషద్‌కు అందజేశారు.

ఘనంగా ప్రేమ్‌సాగర్‌రావు జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఆసిఫాబాద్అర్బన్: మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ గాధవేణి మల్లేశ్, చరణ్, నిసార్, ప్రతాప్, అసద్, ఖలీం, వసంత్‌రావు, దత్తు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. రెబ్బెన, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు రమేశ్, చరణ్, పట్టణ అధ్యక్షుడు మురళి, సీనియర్ నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, మాజీ ఎంపీటీసీ కొవ్వూరి శ్రీనివాస్, నాయకులు అశోక్, వెంకటేశం చారి, మాజీ ఉప సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉచిత న్యాయ సహాయం అభినందనీయం’


సతీశ్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: ఇటీవల జైనూర్ మండలంలో జరిగిన హింసాత్మక ఘటనలో భాగంగా జైలులో ఉన్న ఆదివాసీ, హిందువులకు సీనియర్ న్యాయవాది బోనగిరి సతీశ్‌బాబు అండగా నిలిచి ఉచిత న్యాయ సహాయం అందించడం అభినందనీయమని గంగాపూర్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇగురపు రమేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో సతీశ్‌బాబును కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. నాయకులు చుక్కయ్య, న్యాయవాదులు ఇగురపు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

‘గిరి పోషణ్ మిత్ర’ ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరి పోషణ్ మిత్ర కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరి పోషణ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రక్తహీనతతో బాధపడుతున్న బాలికలను గుర్తించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు రక్త హీనతతో బాధపడుతున్న వారిని గుర్తించిన అనంతరం తదుపరి వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. మండల వైద్యాధికారి సర్ఫరాజ్, సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, ల్యాబ్ టెక్నిషన్ సమి, పల్లవి, సుష్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు అక్షరాలు చదివేలా, రాసేలా నాణ్యమైన విద్యాబోధన చేయాలని మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రొడ్డ శైలజ అన్నారు. శనివారం మండలంలోని మామిడిగూడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పోతగూడ, ఖండాల (బి), ధర్‌లొద్దీ, పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలలను సందర్శించిన ఆమె విద్యార్థులకు సాధారణ పదాలు, సంఖ్యలు, చిన్న సంఖ్యల పట్టిక, పుస్తక పఠనం వచ్చేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సాధించిన మార్కుల రికార్డులలో పొందుపర్చాలన్నారు. ఎస్‌సీఈఆర్‌పీ మధుసూదన్, పీజీ హెచ్‌ఎం ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి


నివాళులర్పిస్తున్న పద్మశాలీ వెల్ఫేర్ సభ్యులు

రెబ్బెన: పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షుడు మారిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తొలిదశ తెలంగాణ ఉద్యమంలో శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధనకు పదవులు ఆశించకుండా కృషి చేసిన గొప్ప మహనీయుడన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గుండేటి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి చందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పొన్న శంకర్, నాయకులు అనిల్‌కుమార్, వెంకట్, నారాయణ, సాంబయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చౌక్‌లో ఘర్షణ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో శుక్రవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డాయి. తన వ్యక్తిగత వీడియోలు ఉన్నాయంటూ ఓ యువకుడిపై మహిళ దాడి చేయగా, విషయం తెలుసుకున్న యువకుడి బంధువులు మహిళపై ప్రతిదాడి చేశారు. పట్టణ సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఓ మహిళ శుక్రవారం రాత్రి పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లోని ఒక మద్యం దుకాణంలో పనిచేసే చిలుముల పురుషోత్తంపై దాడి చేసింది. విషయం తెలుసుకున్న పురుషోత్తం బంధువులు మహిళపై దాడికి పాల్పడ్డారు. దీంతో తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై సదరు మహిళ బైఠాయించింది. పట్టణ సీఐ శంకరయ్య సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేస్తుండగా, రోడ్డుపై కూర్చున్న మహిళను ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో గాయపడ్డ మహిళను స్థానికులు మెరుగైన చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారును అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. పురుషోత్తం ఫిర్యాదు మేరకు రేష్మ, సంతోష్, సాయిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జమిలి వద్దు.. దామాషా ముద్దు



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: జమిలి ఎన్నికల వద్దు.. దామాషా పద్ధతి ఎన్నికల ముద్దు.. అని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ప్రజాస్వామ్య భారత్‌లో రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్ల పైబడిన వారందరికీ ఓటుహక్కు కల్పించబడుతోందన్నారు. దామాషా పద్ధతి ఎన్నికలు జరిగితే విధి విధానాలు ఎన్నికల కమిషన్ రూపొందించి ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు. అంతే కాకుండా అన్ని రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంట్‌లో ప్రజల పక్షాన నిలబడే అవకాశం ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి నల్గొండ ఎంపీగా రెండు సార్లు దామాషా పద్ధతి ఎన్నికల విధివిధానాలను పార్లమెంట్లో ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, కుంటాల రాములు, రాందాస్, నర్సింగ్ రావు, భూమన్న, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం


జైనూర్‌లో నిర్మానుష్యంగా రోడ్డు


కౌటాలలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జైనూర్: ఇటీవల ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న సంఘటనలతో అప్రమత్తమైన పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. శనివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన తెలంగాణ బంద్ మండల కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు చేసిన అనంతరం ప్రజలకు అనుమతినిచ్చారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావొద్దని కోరారు.

కౌటాల: ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం కౌటాలలో బంద్ పాక్షికంగా జరిగింది. వ్యాపార సముదాయాలు, పాఠశాలలు యథావిధిగా కొనసాగగా, ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోయాయి. బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. బంద్ నేపథ్యంలో కౌటాల ఆర్టీసీ బస్టాండ్, తలోడి చౌరస్తా ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం దగ్గరుండి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్సై మధుకర్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సంబరాలు


కైరిగూడ ఓసీపీ వద్ద సంబరాలు

రెబ్బెన: సింగరేణి చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు సైతం సింగరేణి లాభాల్లో నుంచి బోనస్ చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు సంబరాలు చేసుకున్నారు. గత సంవత్సరం వరకు కేవలం పర్మినెంట్ కార్మికులకు మాత్రమే సంస్థ లాభాల్లో వాటా చెల్లించేవారు. బొగ్గు ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికులు సైతం భాగస్వామ్యం అవుతుండడంతో తమకు సైతం వాటా చెల్లించాలని ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు మొండిచేయి చూపగా రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దసరాకు ముందే కాంట్రాక్టు కార్మికులకు తీపి కబురు అందించింది. సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్ కార్మికులకు 33 శాతం లాభాల్లో వాటా చెల్లించటంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్‌గా రూ. 5వేలు చెల్లించనున్నట్లు ప్రకటించారు. ఈనేపథ్యంలో శనివారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీతో పాటు గోలేటిలో కాంట్రాక్టు కార్మికులు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ శివారులో గల చేపల చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగ్గ సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం హెడ్ కానిస్టేబుల్ శ్యాంరావు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి చేపల చెరువు వద్ద పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. మంచిర్యాల జిల్లా తాండూరుకు చెందిన సాలిగాం బానయ్య, మాస వెంకటస్వామి, పెద్దబోయిన మల్లేశ్, కంపల చిన్నయ్య, రెహ్మత్‌ఖాన్, కోట మురలి, సరాండి గ్రామానికి చెందిన మదిషెట్టి కార్తిక్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.5200 సీజ్ చేశారు. వారిని పోలీసులు విచారించగా మంచిర్యాల జిల్లాకు చెందిన మహేందర్ రావు, సూరం రవీందర్ రెడ్డి, పేరం శ్రీను, కాదరి రత్నాకర్‌రావు అనే నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తేలింది.

పురుగులు పట్టినా పట్టించుకోరా?

- ఏళ్లుగా నిల్వ ఉంచిన బియ్యం
- దుర్గంధం వెదజల్లుతున్న ఎంఈవో కార్యాలయం
- పట్టించుకోని అధికారులు


నిల్వ ఉన్న బియ్యానికి పట్టిన పురుగులు


పాడైపోయిన బియ్యం

కౌటాల: మండలంలోని విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా.. ఏళ్లుగా ఎంఈవో కార్యాలయంలో దుర్గంధం వెదజల్లుతోంది. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని మీటింగ్ హాల్‌లో నాలుగేళ్ల క్రితం 20 క్వింటాళ్ల మధ్యాహ్న భోజన బియ్యాన్ని అధికారులు నిల్వ ఉంచారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా పాఠశాలను మూసి వేయడంతో పాఠశాలలకు బియ్యం సరఫరా చేయలేదు. పాఠశాలల పునఃప్రారంభం అనంతరం నిల్వ ఉంచిన బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా అప్పటికే బియ్యం పాడైపోగా, ఏళ్లుగా ఎంఈవో కార్యాలయంలోని సమావేశ గదిలోనే నిల్వ ఉంటున్నాయి. దీంతో బియ్యం చెడిపోయి, పురుగులు పట్టి మీటింగ్ హాల్ అధ్వానంగా తయారైంది. వర్షాకాలంలో పురుగులు కార్యాలయంలోని అన్ని గదుల్లోకి ప్రవేశిస్తున్నాయి.

ఆరుబయట సమావేశాలు..

ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించే గదిలో బియ్యం నిల్వ ఉంచడంతో ఆరుబయట సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్యాలయం సమీపంలోకి వెళ్తే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ సిబ్బంది జిల్లా అధికారులకు విన్నవించినా తరలించడం లేదు. దీంతో దుర్వాసనతో పాటు పురుగులతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారు కార్యాలయంలో ఉన్నంత సేపు ముక్కు మూసుకొని ఉండి పని చేసుకొని వెళ్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పురుగులు పట్టిన బియ్యం ఇక్కడి నుంచి తరలించాలని సిబ్బంది కోరుతున్నారు.

బియ్యం తరలించాలి



ఏళ్లుగా ఎంఈవో కార్యాలయంలో బియ్యం నిల్వ ఉండడంతో పూర్తిగా చెడిపోయింది. ప్రస్తుతం బియ్యానికి పురుగులు పట్టి కార్యాలయం అధ్వానంగా మారింది. పనుల నిమిత్తం కార్యాలయం వైపు వెళ్తే దుర్వాసన వెదజల్లుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పురుగులు పట్టిన బియ్యాన్ని కార్యాలయం నుంచి తరలించాలి.

- తిరుపతి, కౌటాల

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తాంసి: ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా బోధన చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం పరిశీలించి పలు విషయాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ రికార్డులను పరిశీలించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు. సిలబస్ త్వరగా పూర్తిచేసే విధంగా బోధన చేపట్టాలని, ఇప్పటి నుంచే పరీక్షలు సన్నద్ధమయ్యేలా ప్రణాళికతో విద్యార్థులు చదువుకునే విధంగా చూడాలని ఆదేశించారు. వారి వెంట కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు తిరుపతి రెడ్డి, రమణ, దేవేందర్, శశికుమార్ పాల్గొన్నారు.

‘ఎంపీ, ఎమ్మెల్యేపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం’


మాట్లాడుతున్న అలాల అజయ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ లేకుండా అధికారిక కార్యక్రమాలు చేయడం సరికాదన్నారు. వారి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి రూ. 322 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, హడావిడిగా కొబ్బరికాయలు కొట్టి అభివృద్ధి పనులను చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచిన పాయల్ శంకర్‌కు అనుభవం లేకపోయినా, ఎంపీ నగేశ్ అనుభవం ఉన్నా ప్రొటోకాల్ ఉల్లంఘించడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు దమ్మపాల్, ప్రకాశ్, మోబిన్, సృజన్, హైమద్ పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు


క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఆరెగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల క్రీడామైదానంలో శనివారం అండర్ -14, అండర్ -17 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వంద మంది బాలికలు పాల్గొన్నారు. ప్రతీ విభాగం నుంచి 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు పర్స చంద్రశేఖర్, గన్నారం ప్రధానోపాధ్యాయులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత


మట్టి పోస్తున్న యువకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దరిగాం గ్రామానికి వెళ్లే రహదారి సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన దరిగాం యూత్ సభ్యులు శనివారం గుంతల్లో ట్రాక్టర్ల ద్వారా మొరం వేయించి గుంతలు పూడ్చారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన గుంతల్లో ట్రాక్టర్ల ద్వారా మొరం వేయించారు. కార్యక్రమంలో యువకులు రాంబాబు, మల్లేశ్, కుమార్, ప్రవీన్, ప్రశాంత్, గణేశ్, నవీన్, శేఖర్, చంటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.